# గొప్ప మనసు

— వాసిరెడ్డి వెంకట సుబ్బారెడ్డి

**అది సువిశాలమైన చింత తోపు.**

**మిట్ట మధ్యాహ్నవేళ చుట్టు ప్రక్కల పొలాల్లో పనీపాటా చేసుకునే కూలీలు చెట్ల నీడలో కూర్చొని విశ్రాంతి తీసుకుంటున్నారు.**

**ఎండ దెబ్బకు తాళలేక మేక పిల్లలు చెట్ల క్రిందకు పరుగులు తీస్తున్నాయి. ఆ తోపు మధ్యలో శాఖోప శాఖలుగా విస్తరించిన ఓ పెద్ద చింత మాను క్రింద దిగిన సంచార జాతుల వారి కుటుంబాల వారు పిచ్చాపాటి మాట్లాడుకుంటున్నారు.**

అంతవరకూ ఆ చెట్ల నీడన కూర్చొని-రుబ్బు రోళ్ళనూ, తిరగళ్ళనూ దీక్షగా చెక్కుతున్న సత్తెయ్య, ఆయన కుమా రులూతిండి తినడానికి ప్రక్కనే వున్న తమ గుడిసెల్లోకి వెళ్ళారు.

అప్పుడే ఒక వ్యక్తి గబగబా అక్కడికి వచ్చాడు. వారి గుడిసెల ముందు నుంచొని "సత్తెయ్యా!" అని బిగ్గరగా కేకపెట్టాడు. ఆ పిలుపుకు "అయ్యా!" అంటూ సత్తెయ్య కంచం ముందు నుంచి లేచి బయటికి వచ్చాడు కలవర పడుతూ.

"ఈ తోపును మల్లయ్యగారు కొనేశారు. రేప్పొద్దున్నే ఆయన మనుషులు వచ్చి తోపును నరకడం మొదలు పెడతారు. అందుకనీ తెల్లారేసరికల్లా మీ గుడిసెలన్నీ కాళీ చేయించాలని అయ్యగారు చెప్పమన్నారు. కాబట్టే, మీరు యామాత్రం ఆలస్యం చెయ్యకుండా గుడిసెలను కాళీ చేసెయ్యండి!" అని, సత్తెయ్య జవాబుకు ఏమాత్రం ఎదురుచూడకుండా గిరుక్కున వెనుదిరిగి వెళ్ళిపోయాడు.

సత్తెయ్యకు కళ్ళు గిర్రున తిరిగాయి. ఇది కలా, నిజమా! బోధ పడటం లేదు. అంతా అగమ్య గోచరంగా వుంది.

దానికి కారణం అది ధర్మ తోపు. ఎప్పుడో-ఎవరో, ధర్మాత్ములు పరోపకార బుద్ధితో విశాలమైన ఆ చింత తోపును పెంచి, ప్రజలకు వదిలిపెట్టి వెళ్ళారు. చింత చిగురు మొదలుకుని పిందెల్లా, కాయల వరకూ యధేచ్ఛగా బీదా బిక్కీ ఎవరికి అవసరమైనవి వారు కోసుకుని వెడుతూ వుంటారు. కానీ ఎవరు కూడా కొమ్మలు నరకడం లాంటి దుర్మార్గపు పనులు చెయ్యరు. అది అక్కడి నియమం.

ఇప్పుడు కాలం మారింది. ఆ గ్రామం మండలం అయింది. ఇళ్ళ స్థలాలకు గిరాకీ విపరీతంగా పెరిగిపోయింది. అప్పుడే మల్లయ్య అనే షావుకారు దృష్టి ఆ తోపుమీద పడింది. వెంటనే అతను పట్నం ప్రయాణమై వెళ్ళాడు. ఎక్కడో వున్న ఆ తోపుకు సంబంధించిన పట్టాదారుల వారసులను పట్టేశాడు. ఎలాగో వారిని ఒప్పించి మొత్తం తోపును కొనుగోలు చేసి తన పేర రిజిష్టరు చేయించుకొని మరీ వచ్చాడు.

తోపును నరికించెయ్యడం పూర్తి కాగానే ఇళ్ళ ప్లాట్లు చేసి ఆ స్థలాన్ని విక్రయిస్తే లక్షలకు లక్షలాదాయం వస్తుంది. అమాయకుడైన సత్తెయ్యకు ఇదంతా ఊహాకందని విషయం.

సత్తెయ్య మంచి వయసులో వున్నప్పుడు భార్యతోటి ఆ ప్రాంతాలకు వచ్చాడు. ఆ తోపుకు సమీపంలోనున్న తిప్పను చూచాడు. అక్కడి గనులలో తన వృత్తికి అవసర మయ్యే నుడి రాయి పుష్కలంగా లభ్యమవుతుందని గుర్తించాడు. ఆ తోపు అటు తిప్పకూ, ఇటు గ్రామానికీ అందుబాటులో వున్నందువల్ల అక్కడే స్థిరనివాస మేర్పరచుకుని తన వృత్తిని కొనసాగిస్తూ వచ్చాడు.

నలుగురు బిడ్డలు కలిగిందీ ఆ తోపులోనే- వారు పెరిగి పెద్దవారైందీ ఆ తోపులోనే. వారికి భార్యలు వచ్చిన తర్వాత తలా ఒక గుడిసె వేసుకొని వేరు కాపురాలు పెట్టిందీ ఆ తోపులోనే. అలా వారికీ, ఆ తోపుకూ విడదీయరాని బంధం.

సత్తెయ్య కుమారులు కూడా తమ వృత్తిలో మంచి నైపుణ్యం గలవారయ్యారు. అది మెట్ట ప్రాంతం గాబట్టే అక్కడ రాతి రోళ్ళు, తిరగళ్ళకు మంచి గిరాకీ. కంకుల

ఆంధ్ర సచిత్ర వారపత్రిక 6-4-90

## నవ్వుల నదిలో...

ధరణికోటగారు క్లాసులో పాఠం చెప్తున్నారు. అవతల మైదానంలో ఓ గాడిద అదేపనిగా సంగీత సాధన సాగిస్తోంది. క్లాసులోకి కొందరు బుద్ధిమంతులు గాడిదతో గొంతు కలిపి, గలభా చేయడం మొదలు పెట్టారు. ధరణికోటగారు చాలా సేపు ఓపిక పట్టారు. అయినా ఎంతకీ గాడిద గానము ఆగదు, క్లాసులో అల్లరీ ఆగదు. చివరికి ఆయన పాఠం చెప్పడం నిలిపి ఇలా అన్నారు — "సరే, కానీండి మీ స్వజాతీయభిమానము అంత మిక్కుటముగా నుండగా, నేనేం కాదనవలె..." — అంతే అందరి నోళ్ళు మూతపడ్డాయి.

మరో రోజున క్లాసులో కాకులు జొరబడి 'కావు కావు'మని అరుస్తున్నాయి. వాటితో పిల్లలూ అరుస్తూ గలభా చేయడం మొదలెట్టారు. ధరణికోటగారు పాఠం చెప్పడం ఆపి కాసేపు కాకులవైపూ, పిల్లలవైపూ తేరిపార చూచి "ఔరా! ఏమి ఈ కాకిగోల" అన్నారు. అంతటితో అందరూ గప్‌చిప్!

ఇంకొక రోజున ధరణికోట గారు ఏదో క్లాసు తీసుకుంటున్నారు. చాలా సీరియస్‌గా పాఠం చెప్పుకుపోతున్నారు. ఇంతలో ఒక కుక్క వచ్చి గేటువద్ద నిలబడింది. అల్లరి విద్యార్థులకు అంతకంటే అవకాశం ఏముంది? కుక్కను చూచి కేకలు పెట్టడం, అల్లరి చేయడం మొదలుపెట్టారు. అప్పుడు ధరణికోటగారు మెల్లగా లేచి సరాసరి కుక్క వద్దకు వెళ్ళి — "నో అడ్మిషన్, కమిన్" అని అన్నారు. అంతే, మళ్ళీ ఎవరూ నోరెత్తిన పాపాన పోలేదు.

—సేకరణ

వై. శరచ్చంద్రశేఖర్

గుండ్లు దగ్గర నుండి చిన్న కల్వం వరకూ అన్నిట్నీ చక్కగా తయారు చేసి అమ్ముకుంటూ ప్రశాంతంగా జీవిస్తున్నారు.

అలాంటి వారి కీవార్త పిడుగుపాటే అయింది. ఇప్పటి కిప్పుడు గుడిసెల చుట్టూ ఎక్కడ పడితే అక్కడ ముడి రాళ్ళు చెల్లాచెదరుగా పడి వున్నాయి. కొన్ని పూర్తి రూపాన్ని సంతరించుకున్నవీ, కొన్ని సగం వరకూ మలిచినవీ, మరి కొన్ని ప్రారంభ దశలోనే వున్నవీ-ఇలా వివిధ రూపాలలో వున్నాయి. పాపం వారి ఆస్తి అంతా అదే కదా!

సత్తెయ్య దిగులుతో గుడిసె ముందు కూలబడి గత్యం తరమేమిటా అని ఆలోచించసాగాడు. ఆయన చుట్టూ నలుగురు కొడుకులు చేరి మొదట ఈ గండం నుండీ గట్టెక్కే మార్గమేమిటా అని తర్కించనారంభించారు.

"అయ్యా! నరసంముగారి నముపుల కొట్టాల యెనక చాలా ఖాళీ జాగా వుందయ్యా! ఆయనగారి దగ్గరికెళ్ళి అడిగి చూడరాదూ!" అన్నాడు పెద్దకొడుకు. మిగతా వారా సూచనను బలపరిచారు.

ఆ ముందరోడే సర్పంచ్‌గారికి జొన్న కంకులు తొక్కించుకోవడానికి అవసరమయ్యే పెద్ద కంకుల గుండును చక్కగా మలిచి యిచ్చారు. ఆ పరిచయముందిగా బట్టే సత్తెయ్య—"సరే, అడిగొస్తా!" అని సర్పంచ్‌గారి యింటికి వెళ్ళాడు. ఆయన నిద్ర నుండి లేచి ఫలహారం చేసి దర్శనమిచ్చేటప్పటికి సాయంత్రం నాలుగైంది. రెండు చేతులెత్తి నమస్కరించి, ఆయనకు తన గోడును విన్నవించుకున్నాడు సత్తెయ్య.

ఆయన పెదవి విరిచి "అబ్బే! వీలుపడదు సత్తెయ్యా! అక్కడ కోళ్ళ ఫారాలను వేయించాలని అనుకుంటున్నాం! లేకపోతే నీకు కాదనే దేముంది! చూడు! వెళ్ళి ఆ పాత మునసబు రామయ్యగారిని కలువు. ఆయన నాముల దొడ్లో కావలసినంత జాగా వుంది!" అని ఉచిత సలహా ఒకటి పారేశాడు!


సత్తెయ్య రామయ్యగారి వద్దకు పరుగు తీశాడు ఆశతో. ఆయన ఎప్పుడో తీసుకున్న పెద్ద రోలు ఖరీదు డబ్బును ఇప్పటికీ పూర్తిగా ఇవ్వలేదు. అయినా సత్తెయ్య ఆయన ఎదుటబడి నోరు విప్పి అడిగి ఎరుగడు. ఇలాంటి ఆపద సమయంలో సహాయ పడగలడనే విశ్వాసం తోటే వెళ్ళి ఆయనకు తన దుస్థితిని వివరించి ఆదుకొమ్మని ప్రాధేయ పడ్డాడు.

రామయ్య అంతా విని తలను అడ్డంగా ఊపుతూ—

"అక్కడంతా బాగుచేసి సపోటా మొక్కలను నాటాలని అనుకున్నాం సత్తెయ్యా! ఆ...నీకు మంచి ఉపాయం చెబుతా యిను-ఆ పాత కరణం కామయ్యగారున్నారు చూశావూ...ఎలాగైనా సరే ఆయన్ను ప్రతిమాలుకుని వాళ్ళ మామిడి తోపులో చేరండయ్యా! మీకక్కడ హాయిగా వుంటుంది" అని సలహా చెప్పాడు.

సత్తెకాలపు సత్తెయ్యకు ఇంకా ఆశ చావలేదు. ఆ కామయ్యగారి వద్దకూ పరుగుతీశాడు. ఆయనగారు ఇటీవలనే తన చిన్న కుమార్తె కోసం ఓ తిరగలి, పెద్దల్లుడు కోసం మందులు నూరుకునే ఓ కల్వం సత్తెయ్య వద్ద నుండి తెప్పించుకున్నాడు (ఉచితంగానే). ఆయన తన రాచ కార్యాలు పూర్తి చేసుకుని బయటికి వచ్చాక-సత్తెయ్య తనకు

తెలుగు కళాసమితి (న్యూజెర్సీ) ప్రమోద ఉగాది కథల పోటీలో ద్వితీయ బహుమతి రు. 700లు పొందిన రచన



తాత్కాలికంగానైనా తోటలో ఆశ్రయం కల్పించమని వేడుకున్నాడు.

"అయ్యో! కుదరదు నత్తెయ్యా! చెట్ల మధ్య అంతా దున్నించి నేరుగా విత్తాలని అనుకుంటున్నాను" అని కామయ్య గారు సెలవిచ్చారు. అయితే సలహా మాత్రం యివ్వలేదు.

అప్పటికి పొద్దుకొండలో పడింది. ఇక ఎవరిని అడిగినా లాభం లేదనుకుని నత్తెయ్య నిరాశా నిస్పృహలతో తన గుడిసెల వద్దకు చేరాడు. జరిగిందంతా కొడుకులకు చెప్పి- తలపట్టుకుని కూచున్నాడు.

నత్తెయ్య ఆ గ్రామంలో అందరికీ చిరపరిచితుడే! పదిమందికీ ఉపయోగపడే వాడే! కానీ, సమయానికి ఆయన్ను ఆదుకునే నాథుడే కరువయ్యాడు.

రాత్రయింది. పిల్లలేమైనా తిండి తిన్నారేమోగానీ పెద్దవాళ్ళెవరూ నచ్చి మంచి నీళ్ళు ముట్టలేదు. ఏం చెయ్యాలో తోచక తలా ఒకచోట కూలబడి విచారగ్రస్తులై వున్నారు.

ఉన్నట్టుండి నత్తెయ్య భార్య నత్తెమ్మ-

"అయ్యా! మన కుమ్మర జన్నన్నను కలుసుకోలేకపోయినావూ! ఆయనేదైనా ఉపాయం చెప్పనేమోగదా!" అని జ్ఞాపకం చేసింది.

"అవునవును. ఆయన కలిక చేస్తే బాగుండేది" అని కొడుకులన్నారు.

"అయ్యో! పొరపాటేరా!" అని నత్తెయ్య నొచ్చుకున్నాడు. ఎంచేతంటే మొదటి నుండి ఆ గ్రామంలో నత్తెయ్య కుటుంబానికి మిక్కిలి సన్నిహితుడు, ఆప్తుడు జన్నయ్య మాత్రమే. ఎప్పుడో నత్తెయ్య ఒక రోలునూ తిరగలినీ చేసి జన్నయ్యకిచ్చాడు. పైకం తీసుకోలేదు. అంతే- అప్పటి నుండి నేటి వరకు గూడా నత్తెయ్య కుటుంబానికి అవసరమైన కుండలు, చట్లు, బానలు మొదలైన వాటిని జన్నయ్య ఉచితంగానే అందజేస్తున్నాడు. అంతేకాకుండా అప్పుడప్పుడు తోపులోకి వెళ్ళి వారి యోగక్షేమాలను విచారించి వస్తూ వుంటాడు.

అది స్మరించగానే నత్తెయ్యకు కొంచెం ధైర్యం కలిగింది. 'ఎప్పుడు తెల్లవారునా, ఎప్పుడు ఊళ్ళోకి వెళ్ళి జన్నయ్యను కలుద్దామా' అనే తలపులతో ఆ రాత్రి నత్తెయ్యకు నిద్రే పట్టలేదు. ఎప్పుడో తెల్లవారుఝామునకు అలా కన్నులు మూతపడ్డాయి.

"అయ్యా!" భార్య పిలుపుతో ఎగిరిపడి లేచి కూచున్నాడు నత్తెయ్య. ఆమె చేసైగతో అటు చూడమన్నది.

అప్పటికి బాగా తెల్లవారింది. దాదాపు పాతిక మంది కూలీలు గొడ్డళ్ళను చేతబట్టి, తోపును అప్పుడే నరకడం ప్రారంభించి వున్నారు. చెట్ల మీద పక్షులు అటూ ఇటూ ఎగురుతూ హృదయ విదారకంగా అరుస్తున్నాయి. ఆ తోపులో దిగి వున్న సంచార జాతులవారు మూటా ముల్లె సర్దుకుని పరుగెత్తి పోతున్నారు. ఆ దృశ్యం చూడగానే నత్తెయ్య గుండె ఝల్లుమన్నది. మారు మాట్లాడకుండా ఎవరో తరుముతున్నట్లుగా ఊరి వైపుకు పరుగులు తియ్యసాగాడు.

సగం దూరం వెళ్ళేసరికల్లా ముందు జన్నయ్య నడుస్తూంటే వెనకాలే ఒంటెద్దు బండి రావడం కనిపించింది. (జన్నయ్యకు బండిలో కూర్చుని తోలే అలవాటు లేదు) నత్తెయ్య ఆనందంతో అటే చూస్తూ-

"బండి కాలీగా వుందే. మామూలుగా జన్నయ్య బండి నిండుగా కుండ లేసుకోని పల్లెల్లోకి పోతా వుంటాడు వాటిని అమ్ముకోడానికి. మరి కాలీ బండి వస్తా వుందాదేందబ్బా!" అని తర్కించుకుంటూ వుండగానే బండి సమీపించింది. జన్నయ్య నత్తెయ్యను చూస్తూనే-

"నత్తెయ్యా! మీ సంగతి రాత్రి పొద్దు బోయినాక నాకు తెలిసిందయ్యా! ఈ దరను తోపు అమ్మకం జరిగి పోయిందనీ, తోపును నరికిపారేసి ఇండ్ల జాగాలకు అమ్ముకుంటారనీ యిన్నాను. రాత్రంతా మా ఇంట్లో మీ గురించిన ఆలోచనే నత్తెయ్యా! పాపం మీరు ఎప్పటి నుండో కడుపులో చల్ల కదలకుండా అడ నివసించుకుంటా బతుకుతుండిరాయె! ఇయ్యాల నెడ మీదికొచ్చి పడె! ఇప్పుడికిప్పుడు ఉన్నట్టుండి వాళ్ళేడికి పోతారబ్బా అని బలే యిదయిపోయినం నత్తెయ్యా! సరే, మనమేం జేస్తం! జరిగేదాన్ని ఆపలేం గదా! అయిన్నీ పెద్ద పెద్దోళ్ల పనులు! సరే అది పోనీ- అదంతా దేవుడు చూసుకుంటాడు! ముందు మీరీ ఆపద నుండి గట్టెక్కాల గదా! అందుకే రాత్రి మేం ఒకటను కున్నం. మొదటా మీరూ, మీ పిల్లాజెల్లా మా యింటికి వచ్చేసెయ్యండి! పాత కొట్టముంది మాదు ఆదున్న కుండ లన్నిట్నీ తీసిచ్చి కాలీ చేయించినా! ఇప్పటికిప్పుడు మీరు ఆడ వుడకేసుక తినొచ్చు. నిదానంగా మా ఆవం పెక్కన శానా కాలీ జాగా వుంది చూడూ ఆడ మీ గుడిసెలు యేసుకోవచ్చు. మనయి పెద్ద యాపమాన్లు రెండుండాయి గదా! అటి కింద కూకోని మీ పన్లు ఏ ఆటంకం లేకుండా జేసుకోవచ్చు" జన్నయ్య చెప్పుకొని పోతున్నాడు.

నత్తెయ్య సంభ్రమాశ్చర్యాలలో మునిగి పోతున్నాడు. రాత్రి తానూ తన భార్యా, కుమారులూ జన్నయ్యను గురించి తలపోసుకోవడం, తెల్లారే సరికి ఈయన తమ కొరకే బయలుదేరి వస్తూ వుండడం! ఇదంతా వాస్తవమేనా! నత్తెయ్య నమ్మలేక పోతున్నాడు.

'సరే! అయితే మరి ఈ బండెందుకు యెనకనే' అనుకుంటూ బండి వైపు దృష్టిని సారించాడు.

అది గ్రహించిన జన్నయ్య వెంటనే-

"ఒకటేసారి మీ సామాన్లు, బొచ్చెలు, బోశెలు బండ్లో యేసక పోదామని వస్తన్నా నత్తెయ్యా! మద్దినేల నుండి- మీ రోళ్లు, రాళ్లు, తిరగల్లూ అన్నిట్నీ ఆడికి చేరిపించే యారపాట్లు చేసేసుకుందాం!" అన్నాడు ఉత్సాహంగా.

నత్తెయ్యకు నోట మాట రావడం లేదు. కళ్ళ నుండి ఆనందాశ్రువులు జలజల రాలసాగాయి. ✱

## పాడైతే మాత్రం...

జాన్ రస్కిన్, ఒకసారి తన బంధువుల ఇంటికి వెళ్ళాడు. ఆ బంధువుల ఇంట్లో ఎనిమిది, తొమ్మిది సంవత్సరాల పాప వుంది. ఎంతో ముద్దుగా వున్న ఆ పాపకు ప్రేమగా రస్కిన్ విలువైన తన రేష్మి రుమాల్ ఇచ్చాడు. ఒకరోజు ఆ పాప ఏదో వ్రాసుకుంటూ వుండే సమయంలో సిరా బుడ్డి క్రిందపడి పగిలి పోయింది. కొంచెం సిరా రస్కిన్ ఇచ్చిన రుమాల్‌పై పడింది. ఆ పాప ఆ రుమాల్ చెడిపోయినందుకు ఏడ్చినా చేసేది లేక దాన్ని పారవేయబోయింది. అది చూసిన రస్కిన్ వారిస్తూ "పాడైతే పారవేయడమేనా ఏ వస్తువు నైనా? అలా చేయరాదు. దాన్ని మనం బాగు చేసుకొన దానికి ప్రయత్నించాలి. మనిషికి కాలో చెయ్యో- విరిగితే వారిని విడిచి పెట్టేస్తున్నామా? అలాగే పాడైపోయిన వస్తువును పారవేయకుండా బాగు చేసుకోవడానికి ప్రయత్నించాలి." అని అంటూ ఆ రేష్మి రుమాల్‌పై పడిన సిరా మరకలతో ఆయన ఓ బొమ్మను గీశాడు దాని పైనే. అప్పుడది ముందటి కంటే బావున్నట్టనిపించింది. తర్వాత ఆ పాప రుమాల్‌ను ఎంతో కాలం జాగ్రత్తగా దాచి పెట్టుకుంది.

మూలం: హిందీ, సనసిల్

- బాగాపురం నాగేశ్వరరావ్

## అత్యధిక పారితోషికం

ఒక చిన్న కథ రాసినందుకు ప్రపంచంలోనే అత్యధికమైన పారితోషికం పొందిన రచయిత 'ఎర్నెస్ట్ హెమింగ్వే'. 'దిస్నో ఆఫ్ గిలి' అనే కథకు హెమింగ్వేకు లభించిన పారితోషికం 25 వేల డాలర్లు.

- సేకరణ: నందం రెడ్డియ్య, భట్టిప్రోలు.